# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపటి నుంచి ఐదు రోజుల పాటూ సింగపూర్ లో పర్యటించనున్నారు.
- విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణాలను రానున్న 3 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ఏపి మెట్రో రైలు కార్పొరేషన్ ఎండి రామకృష్ణారెడ్డి తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ లో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 669 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఈ రోజు రాత్రి 11 గంటలకు సింగపూర్ కు బయలుదేరనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను సాధించాలనే లక్ష్యంతో ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా సింగపూర్ కు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సింగపూర్ లోని తెలుగు సమాజంతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు రేపు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ తో పాటు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్ లాండ్ సహా పలు దేశాల నుంచి తెలుగు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, ఉద్యోగులు కూడా పాల్గొంటారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నారా లోకేష్, టిజి భరత్, పి.నారాయణ, వివిధ శాఖల అధికారులు ఈ పర్యటనలో భాగం కానున్నారు.

==========================

విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణాలను రానున్న 3 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండి రామకృష్ణారెడ్డి తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న మెట్రోరైల్ ప్రాజెక్టుల కంటే వీటిని అధునాతనంగా నిర్మించబోతున్నామని చెప్పారు. ఈరోజు ఆయన ఒక ప్రైవేట్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ...

ఆసియాలోనే ఎక్కడా లేని విధంగా 20 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ లైన్ ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. సెప్టెంబర్ నాటికి ఈ రెండు మెట్రో రైల్ ప్రాజెక్టుల టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని రామకృష్ణారెడ్డి వివరిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

========================

విశాఖ జిల్లా పరిధిలో చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్ట్, సాధారణ రైల్వే లైన్ల విస్తరణ, ఇతర పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ పనులకు సంబందించిన అధికారులతో ఆయన ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పెందుర్తి - సింహాచలం నార్త్ స్టేషన్ మధ్యలో నిర్మించాల్సిన ఫ్లైఓవర్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్, గాజువాక-కణితి రోడ్, దువ్వాడ-సింహాచలం లైన్ల మధ్యలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై ఈ సమీక్షలో చర్చించారు. ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, ఎంత మేరకు భూమి అవసరం మొదలగు వివరాలపై ఆరా తీసిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

========================

కర్నూలు సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో ప్రతిరోజు అధిక సంఖ్యలో చికిత్స కోసం ఇన్‌పేషెంట్లుగా చేరే రోగుల సహాయకుల అవసరాల నిమిత్తం 14.15 కోట్ల రూపాయలతో విశ్రాంతి భవనాన్ని నిర్మించేందుకు సికింద్రాబాద్ కేంద్రంగా పని చేస్తున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పిజిసిఐ) ముందుకొచ్చింది. ఈ మేరకు వచ్చిన ప్రతిపాదనను సమగ్ర పరిశీలన అనంతరం రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. 'విశ్రామ్ సదన్' పేరుతో నిర్మితమయ్యే ఈ భవనంలో మొత్తం 150 పడకల ఏర్పాటుతో పాటూ.. రిక్రియేషన్ వసతులు, పంప్ హౌస్, జనరేటర్, సోలార్ రూఫ్‌టాప్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించనున్నారు. భవన నిర్మాణానికి ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ సంస్థకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

========================

“పీఎం జన్ మన్” కింద మంజూరైన రహదారి పనులను వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్ని రహదారులు డిసెంబర్ నాటికి పూర్తి కావాలని, అవసరమైన ప్రాంతాల్లో “మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం” కింద అనుసంధానమయ్యే పనులను మంజూరు చేస్తామని చెప్పారు. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాలని, బహిరంగ మలవిసర్జన ఎక్కడా జరగరాదని, కమ్యూనిటీ, శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

========================

మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి విష జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నిరంజన్ సూచించారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో

పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ.. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లో చెత్తను రోడ్డుపై పడివేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి, ప్రతీ రోజు ఇంటికి వచ్చి సేకరించే పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకున్నట్లయితే తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని డాక్టర్ నిరంజన్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ పై ఇంగ్లాండ్ పట్టు సాధిస్తోంది. నాలుగవ రోజైన ఈరోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ ను కొనసాగించిన ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ 141 పరుగులు చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆరంభంలోనే రెండు వికెట్లను కోల్పోయింది. దీంతో భోజన విరామ సమయానికి భారత్ ఇంకా 310 పరుగుల వెనుకంజలో ఉంది.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన నిన్నటి వాయుగుండం రేపటికి క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో పాటూ.. ఉపరితల ఆవర్తనంతో రానున్న 5 రోజులు ఉత్తర కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================
==========================